సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం

సిద్దవటం రేంజ్‌లోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పిచామని రేంజర్ తెలిపారు. - 8లో



దరఖాస్తు చేసిన నెలలోగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

రైతులు దరఖాస్తు చేసుకున్న నెలలోపు సర్వీసులు మంజూరు చేస్తామని తిరుపతి డిస్కం ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 151 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	695	695
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 75.46 కిలోలు

న్యూస్‌రీల్

రేపు పనిదినం

రాయచోటి టౌన్ : ఈ నెల 11న రెండో శనివారాన్ని పనిదినంగా ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఒక రోజును అదనపు సెలవుగా ఉపయోగించుకున్నందున రేపు పనిచేయాల్సి ఉంటుందన్నారు.

షార్‌కు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మదనపల్లె సిటీ : శ్రీహరికోటలోని షార్‌లో ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 శాటిలైట్ ప్రారంభ కార్యక్రమానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. విద్యార్థుల కోసం ఏడు బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

టూరిస్ట్ పోలీసు కార్యాలయం పరిశీలన



టూరిస్ట్ పోలీస్ కార్యాలయం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న వైఎస్సార్ జిల్లా ఎస్పీ అన్బురాజన్

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు కార్యాలయాన్ని గురువారం వైఎస్సార్ జిల్లా ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల గురించి సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని అకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో మొక్కలు పెంచాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల సమన్వయంతో నాటుసారా, మద్యం, ఇసుక అక్రమ రవాణాలను అరికట్టేందుకు దాడులు ముమ్మరం చేయాలన్నారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'దిశ' యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు, సిద్దవటం ఎస్ఐ తులసి నాగప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమూల్ పాలసేకరణ ధర నాలుగోసారి పెంపు



రాజేంద్ర ప్రసాద్

కురబలకోట: జగనన్న పాల వెల్లువ పథకం కింద అమూల్ పాల సేకరణ ధర వరుసగా నాలుగోసారి పెంచినట్లు అమూల్ రాష్ట్ర ఆపరేషన్స్ హెడ్ రాజేంద్రప్రసాద్ గురువారం వెల్లడించారు. శనివారం నుంచి ఇవి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆవుపాలు సగటున లీటర్‌కు రూ.32.13 చెల్లిస్తున్నారు. పెంచిన ధర ప్రకారం ఇక నుంచి రూ.34.59 చెల్లిస్తారని తెలిపారు. లీటర్‌కు రూ. 2.46 పెరిగింది. గేదె పాలు ప్రస్తుతం రూ. 44.97 ఉండగా రూ.45.96కు పెంచారు. లీటర్‌కు అదనంగా 0.99 పెంచినట్లైంది. అన్నమయ్య, వైఎస్సార్ కడప, చిత్తూరు, శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ఈ ధరలు పెంచినట్లు చెప్పారు. ఈ పెంపుతో ఈ జిల్లాల్లో 11 వేల మంది పాల ఉత్పత్తిదారులు ప్రయోజనం పొందుతారన్నారు. ప్రతి ఏటా దీపావళి సందర్భంగా 180 రోజులు పాలు పోసిన వారికి లీటర్‌కు అర్థ రూపాయి చొప్పున బోనస్‌ను వారి ఖాతాలకు జమ చేస్తున్నట్లు వివరించారు. 2021లో 3610 మంది పాడి రైతులకు రూ.25,59, 119, గత ఏడాది 6880 మందికి రూ. 70, 77,772 బోనస్ చెల్లించామన్నారు. ప్రస్తుతం కై రా అముల్ డైయిరీ వైఎస్సార్ కడప,శ్రీ సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రోజుకి 70 వేల లీటర్లు పాల సేకరణ చేస్తోందన్నారు. వీటిలో అన్నమయ్య జిల్లా 30 వేల లీటర్లతో ప్రథమ స్థానంలో ఉందన్నారు.

స్టీల్‌ప్లాంట్ నిర్మాణ ప్రాంగణం పరిశీలన

జమ్మలమడుగు: సున్నపురాళ్లపల్లె సమీపాన నిర్మిస్తున్న ఏపీ హైగ్రేడ్ ఉక్కు కర్మాగార నిర్మాణ ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, ఏపీ హైగ్రేడ్ స్టీల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ షణ్ముగం, సంబంధింత అధికారులు గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ నాగరాజు, తహసీల్దార్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేడి!



- పట్టణాలు, పల్లెల్లో నెల రోజులకు పైగా కనిపించనున్న కోలాహలం
- ఎమ్మెల్సీ ఎన్నికలకు మోగిన నగారా
- స్థానిక, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల
- ఎన్నికలకు సమాయత్తమవుతున్న అధికార యంత్రాంగం
- ప్రక్రియ ముగిసే వరకు అమలులో ఎన్నికల కోడ్



సాక్షి రాయచోటి: రాష్ట్రంలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఎన్నికల నగారా మోగింది. స్థానిక, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ వేడి రగులుకుంటోంది. పట్టణాలు, పల్లెలు మొదలుకొని అన్నిచోట్ల సుమారు నెలరోజులకుపైగా కోలాహలం కనిపించనుంది. ఇప్పటివరకు యువ ఓటర్లకు సంబంధించి ఓటుహక్కు అవకాశాన్ని కూడా ఎన్నికల కమిషన్ కల్పించడంతో అందరూ ఓటుహక్కు నమోదు చేసుకున్నారు. ఇప్పుడా అప్పుడా అంటూ అనుకుంటుండగానే ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల సందడి వాతావరణం మొదలైంది. 2019 సార్వత్రిక ఎన్నికలతోపాటు తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగియగా, ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ మొదలు కానుంది.

జిల్లాలో 46,318 పట్టభద్రుల ఓటర్లు

అన్నమయ్య జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి సుమారు 46,318 మంది ఓటర్లు ఉన్నారు. కడప–అనంతపురం–కర్నూలు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో 22,542 ఓట్లు కాగా, ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల ఓట్లకు సంబంధించి జిల్లాలో 23,776 ఓట్లు ఉన్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్నమయ్య జిల్లాలో మొత్తం 3565 మంది ఓటర్లుగా నమోదయ్యారు. అందులో కడప–అనంతపురం–కర్నూలు పశ్చిమ టీచర్ల ఓటర్లకు సంబంధించి జిల్లాలో 2031 మంది ఉండగా...ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు ఎమ్మెల్సీ పరిధిలో జిల్లాలో 1534 ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

జిల్లాలో గ్రాడ్యుయేట్లకు 44... ఉపాధ్యాయులకు 32 పోలింగ్ కేంద్రాలు

అన్నమయ్య జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల కావడంతో జేసీ తమీమ్ అన్సారియాతో కలిసి జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల కోడ్, ఎన్నికల నియామవళి గురించి వివరించారు. అలాగే అధికారులకు కూడా దిశా నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పట్టభద్రులకు సంబంధించి 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ సీసీ కెమెరాలతో వెబ్‌కాస్టింగ్ జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

అమలులోకి ఎన్నికల కోడ్

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకునేలా ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే ఎక్కడికక్కడ అక్రమ మద్యం, నగదు రవాణా జరగకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని కలెక్టర్ వివరించారు.

పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తన నియమావళి: జిల్లా కలెక్టర్ గిరీషా

రాయచోటి : పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలుచేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై జిల్లా కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ (కడప, అనంతపురం, కర్నూలు), (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ గురువారం విడుదల చేసిందన్నారు. నోటిఫికేషన్ ఫిబ్రవరి 16న విడుదల, ఫిబ్రవరి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 24న పరిశీలన ఉంటుందని, నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 27వ తేదీ చివరి రోజన్నారు. మార్చి 13న పోలింగ్(ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు), మార్చి 16న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. (కడప, అనంతపురం, కర్నూలు) పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లు అన్నమయ్య జిల్లాలో 22542, (కడప, అనంతపురం, కర్నూలు) టీచర్ల ఎమ్మెల్సీ ఓటర్లు అన్నమయ్య జిల్లాలో 2031 మంది ఉన్నారన్నారు. అలాగే (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లు అన్నమయ్య జిల్లాలో 23776, (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) టీచర్ల ఎమ్మెల్సీ ఓటర్లు అన్నమయ్య జిల్లాలో 1534 మంది ఉన్నారని తెలిపారు. ఇలా అన్నమయ్య జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లు మొత్తం 46,318 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 3,565 మంది ఓటుహక్కును కలిగి ఉన్నారన్నారు. ప్రతి మండలంలో ఎంసీసీ టీమ్స్, ఫ్లయింగ్‌స్క్వాడ్‌ను నియమిస్తున్నామన్నారు. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలానికి ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రం, ఎక్కువ మంది ఓటర్లు ఉంటే అక్కడ రెండు పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో పోలింగ్ కేంద్రాలు 44, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్, పక్కన జేసీ తమీమ్అన్సారియా

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- బాలసురక్ష కార్యక్రమం జిల్లా అధికారి శేషగిరిబాబు



మాట్లాడుతున్న డాక్టర్ శేషగిరిబాబు

కేవీపల్లె : బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్రీయ బాలసురక్ష కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ శేషగిరిబాబు అన్నారు. గురువారం మండలంలోని వగళ్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బాలిక సంరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు రక్తహీనత నివారణ, చేతుల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన తోపాటు టోల్‌ఫ్రీ నంబర్లు 100, 112, 181, 1098, 108, 104 ఆవశ్యకత గుర్తించాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల వంటగది, స్టోర్ రూము పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిబాషా, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణి, డాక్టర్ రేష్మ, హెచ్ఈ మహమ్మద్ రఫీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతి, హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తం, స్టాఫ్ నర్స్ సులోచన, సీహెచ్‌వో చందన మైత్రిసుధ, ఏఎన్ఎం రహీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి, కేవీపల్లెలకు నూతన తహసీల్దార్లు

రాయచోటి: రాయచోటి, కేవీపల్లి మండలాలకు నూతనంగా తహసీల్దార్లను నియమిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కేవీపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.ప్రేమనాథ్ కుమార్‌ను రాయచోటికి బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న పి.నరసింహులును కేవీపల్లి తహసీల్దారుగా నియమించారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ తొలి వీసీగా ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- నేడు బాధ్యతల స్వీకరణ



ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్సలర్‌గా ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్‌ను నియమిస్తూ ఉన్నతవిద్య ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు. 2020 జనవరి, 7న ఏర్పాటైన ఈ యూనివర్సిటీ తొలి ఓఎస్‌డీ/ఇన్‌చార్జి వీసీగా ఆచార్య డి.విజయ్‌కిశోర్ రెండేళ్లు పనిచేశారు. అనంతరం అప్పటి వైవీయూ వీసీ ఆచార్య మునగల సూర్యకళావతి ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కర్నూలు అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఫజుల్ రెహమాన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు చెందిన మెకానికల్ ఇంజినీరింగ్ ఆచార్యులు బానోతు ఆంజనేయప్రసాద్ విశ్వవిద్యాలయ తొలి రెగ్యులర్ వైస్ చాన్సలర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

33 ఏళ్ల అనుభవం..

డా.బానోతు ఆంజనేయ ప్రసాద్ అనంతపురం జిల్లా పుట్టపర్తి మండలం నరసింహపల్లి తాండాకు చెందిన బి.ఎల్. నాయక్, బి. గౌరమ్మ దంపతుల కుమారుడైన ఈయన విద్యాభ్యాసం అంతా (బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ) జేఎన్‌టీయూ హైదరాబాద్‌లోనే సాగింది. 1989లో జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరిన ఈయన 2003లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2010 నుంచి ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. బీఓఎస్ చైర్మన్‌గా, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్, ఎంసెట్ రీజినల్ కోఆర్డినేటర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా, వైస్ ప్రిన్సిపాల్‌గా, పలు విభాగాలకు డైరెక్టర్‌గా, అధ్యాపక సంఘం కార్యదర్శిగా, డిప్యూటీ వార్డెన్‌గా, పలు బోర్డులకు చైర్మన్‌గా పనిచేసిన పరిపాలన అనుభవం ఉంది. ఈయన పరిశోధన పత్రాలు 47 అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 11 అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లు, 11 జాతీయ కాన్ఫరెన్స్‌ల్లో ఆయన పాల్గొన్నారు. ఈయన వద్ద ఇప్పటికే 5 మంది పీహెచ్‌డీ పూర్తి చేసుకోగా, మరో 8 మంది పీహెచ్‌డీ చేస్తున్నారు. దీంతో పాటు అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ సభ్యుడిగా, ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ శాశ్వత సభ్యుడిగా ఉండటంతో పాటు పలు కమిటీల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు.

నిరుద్యోగులకు శుభవార్త

- నేడు మదనపల్లెలో మెగా జాబ్‌మేళా
- బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమం
- పాల్గొననున్న 75 ఎంఎన్‌సీ కంపెనీలు
- ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి
- సుమారు 15,000 మందికి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యం
- జాబ్‌మేళాను ప్రారంభించనున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని నిరుద్యోగులకు శుభవార్త. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా జరగనుంది. అన్నమయ్య జిల్లాలోనే ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగాజాబ్‌మేళాలో 75 ప్రముఖ కంపెనీలు పాల్గొని దాదాపుగా 15,000 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే నవాజ్‌బాషా అధ్యక్షతన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 గంటల నుంచి జరగనున్న జాబ్‌మేళాను ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా గురువారం బీటీ కళాశాల గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. జాబ్‌మేళాలో పాల్గొంటున్న కంపెనీల ప్రతినిధులకు వసతి, రవాణా ఏర్పాట్లపై చర్చించారు. జాబ్‌మేళాకు సంబంధించి ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయాల్లో 9,000 మందికి పైగా తమ పేర్లను నమోదుచేసుకున్నారు. వీరితోపాటుగా తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి నియోజకవర్గాల నుంచి మరో 7,000 మంది వరకు నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరవుతారనే సమాచారం ఉన్నందున తదనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పదోతరగతి నుంచి పీజీ వరకు, ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఫార్మసీ, హోటల్‌మేనేజ్‌మెంట్ విద్యార్హత, 18–35 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారందరూ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చు. ఉదయం 9 గంటలలోపు జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు తమ అర్హతల ధ్రువీకరణ పత్రాలు, బయోడేటా, ఆధార్, పాస్‌పోర్ట్ ఫొటో తీసుకుని రావాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..దేశంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో 4.5 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. యువతకు ప్రోత్సాహం కల్పించి, చదువుకున్న ప్రతి ఒక్కరికీ వారి అర్హతల ఆధారంగా ఉద్యోగాలు ఇప్పించాలన్న లక్ష్యంతో ఎంపీ మిథున్‌రెడ్డి హైదరాబాదు, చెన్నై, బెంగళూరులోని ప్రముఖ కంపెనీల ప్రతినిధులను సంప్రదించి మదనపల్లెలో జాబ్‌మేళా ఏర్పాటుచేశారన్నారు. ప్రతి నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జాబ్‌మేళా కోఆర్డినేటర్ శంతన్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వస్తారా.. రారా!

- నందలూరు రన్నింగ్‌స్టాఫ్ నుంచి సంసిద్ధత లేఖలు కోరిన రైల్వే అధికారులు
- ఎర్రగుంట్ల వెళ్లేందుకు విముఖత చూపుతున్న లోకోపైలెట్లు
- అప్పుడు కాంగ్రెస్..ఇప్పుడు బీజేపీ పాలనలో రైల్వే కేంద్రం నిర్వీర్యం
- పట్టించుకోని కార్మిక సంఘాలు



బ్రిటీషు రైల్వేపాలకుల నుంచి కొనసాగిన నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్

నందలూరు: బ్రిటీషు రైల్వే పాలకుల నుంచి నందలూరులో కొనసాగుతున్న రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ ఎత్తివేసే దిశగా గుంతకల్ రైల్వే అధికారులు గురువారం మరో అడుగు ముందుకు వేశారు. ఈ నేపథ్యంలో రన్నింగ్‌స్టాఫ్(లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, గార్డు)లకు నందలూరు వదిలివేసి, ఎర్రగుంట్లలో పనిచేసేందుకు సంబంధించి సంసిద్ధత లేఖలను కోరుతూ గుంతకల్ సీనియర్ డీఈఈ(ట్రాఫిక్) నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో నందలూరు క్రూసెంటర్‌లో పనిచేస్తున్న రన్నింగ్‌స్టాఫ్ ఎటుతేల్చుకోలేక ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ అంశం రైల్వే వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

సౌకర్యాల కొరత..

ఎలాంటి సౌకర్యాలు లేని ఎర్రగుంట్లకు నందలూరు క్రూను తీసుకెళ్లేందుకు అధికారులు సర్వప్రయత్నాలు చేస్తున్నారు. బలవంతంగానో, బెదిరింపులతో అయినా క్రూను తీసుకెళ్లే యోచనలో ఉన్నారు. అక్కడ క్రూ నిర్వహణకు అనుకూలం కాదని అధికారులకు తెలిసినా.. బలవంతంగా రన్నింగ్‌స్టాఫ్‌పై విధులు, బాధ్యతలను రుద్దుతున్నారు.

సంసిద్ధత తెలపకుంటే..

రన్నింగ్‌స్టాఫ్‌లో 80శాతం మంది నందలూరు క్రూసెంటర్‌లోనే విధులు నిర్వహించేందుకు సంసిద్ధతగా ఉన్నారు. అయితే సంసిద్ధత లేఖలో అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కక్షసాధింపులకు బలికావాల్సి వస్తుందోనన్న భయాందోళన మరోవైపు నెలకొంది. అయితే మరికొందరు ఎర్రగుంట్లకు వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. ఎర్రగుంట్లకు వెళ్లడం కన్నా ఇతర ప్రాంతానికి వెళ్లడమే నయమనే రీతిలో తర్జన భర్జన పడుతున్నారు.

అప్పుడు కాంగ్రెస్..ఇప్పుడు బీజేపీ

నందలూరు రైల్వే కేంద్రం నిర్వీర్యం కావడానికి గతంలో కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ పాలకులే కారణమన్న విమర్శలున్నాయి. యూపీఏ పాలనలో స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ఎత్తివేసిన క్రమంలో అన్ని విభాగాలను ఎత్తివేశారు. ఇప్పుడు బీజేపీ పాలనలో చివరిగా ఉన్న రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్‌ను ఎత్తివేసి, నందలూరు రైల్వే చరిత్రకు మంగళం పాడారనే విమర్శలు ఉన్నాయి., లోకోషెడ్‌కు అనుబంధంగా విభాగాలను ఒక్కొక్కటిగా ఎత్తివేస్తూ దశలవారీగా నిర్ణయాలు తీసుకుంటూ వచ్చారు. ఇందులో నందలూరు అంటేనే ఒక కక్ష సాధింపులా అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

నిద్రావస్థలో కార్మిక సంఘాలనేతలు

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం..వారి సంక్షేమం కోసం యాజమాన్యంతో అయినా పోరాటం చేసి సాధించునేవి కార్మికసంఘాలు. అలాంటి కార్మికసంఘాలకు చెందిన జోన్, డివిజన్ స్థాయినేతలు నిద్రావస్థలో ఉన్నారనే వాదన బలంగా వినిస్తోంది. ఇప్పుడు నందలూరు నుంచి క్రూసెంటర్ తరలింపు విషయంలో మౌనం ప్రదర్శిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




నందలూరు రైల్వేకేంద్రంలో ఏడులైన్లు, సైడింగ్‌లైన్లు ఉన్న దృశ్యం

అధికారుల కుట్రలు, కుతంత్రాలు



నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న నందలూరు రైల్వేకేంద్రం నిర్వీర్యం దిశగానే అధికారులు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని అవగతమవుతోంది. అప్పుడు కాంగ్రెస్ పాలనలో లోకోషెడ్ ఎత్తివేసి, ప్రత్యామ్నాయపరిశ్రమ ఏర్పాటుచేసి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి రాదు. ఇప్పుడు బీజేపీ పాలకులు, గతంలో అధికారంలో లేనప్పుడు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మరిచిపోయారు. చివరిగా మిగిలిన క్రూసెంటర్‌ను ఎత్తివేయడం దారుణం. –జంబుసూర్యనారాయణ, సర్పంచ్, నాగిరెడ్డిపల్లె అర్బన్

అంతా బీజేపీ పెద్దల చేతిలోనే..



నందలూరు రైల్వేకేంద్రానికి పూర్వవైభవం సంతరించుకోవాలంటే ఢిల్లీలోని బీజేపీ పెద్దల చేతిలో ఉంది. అన్ని విధాలుగా పోరాటాలు చేశాము. రైల్వేబోర్డు, రైల్వేమంత్రిత్వశాఖ జోక్యంతోనే నందలూరుకు మళ్లీ పూర్వవైభవం వస్తుంది. లోక్‌సభలో ప్రకటించిన హామీ అమలుకు నోచుకోకపోవడం దౌర్భాగ్యం.
–సయ్యద్అమీర్, సెక్రటరీ, జిల్లా వక్ఫ్‌బోర్డు

గంగమ్మ దేవత హుండీ ఆదాయం రూ. 2.15 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అనంతపురం గంగమ్మ దేవత హుండీ ఆదాయాన్ని గురువారం గంగమ్మ ఆలయంలో చైర్మన్ నరసింహారెడ్డి, ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, ఇన్‌స్పెక్టర్ జనార్దన్ రాజుల ఆధ్వర్యంలో లెక్కించారు. రూ. 2,15,272 ఆదాయం వచ్చినట్లు ప్రత్యేక అధికారి రవీంద్రరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, సుబ్బయ్య, అర్చకుడు రెడ్డిశేఖర్, వేమయ్య, గంగన్న, శివశంకర్ రెడ్డి, అంగడి రమణ, సిబ్బంది మార్కేండేయ, రత్నమయ్య, నాగేశ్వరమ్మ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన నెలలోగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

డిస్కం ఎస్‌ఈ కృష్ణారెడ్డి



ఇందిరమ్మకాలనీలో స్థల పరిశీలన చేస్తున్న ఎస్‌ఈ కృష్ణారెడ్డి, అధికారులు.

బి.కొత్తకోట : వ్యవసాయ కనెక్షన్లు కోసం రైతులు దరఖాస్తు చేసుకున్న నెలలోపు సర్వీసులు మంజూరు చేస్తామని తిరుపతి డిస్కం ఎస్‌ఈ ఎం.కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన బి.కొత్తకోట సమీపంలోని ఇందిరమ్మకాలనీకి మంజూరైన 33/11 సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అనంతరం స్థానిక సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు నుంచి ఇప్పటివరకు ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని వ్యవసాయ విభాగానికి 15,000 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేసి ఏర్పాటుచేశామన్నారు. దీనికి అవసరమైన స్తంభాలు, తీగలను, 12,580 ట్రాన్స్‌ఫార్మర్‌లను ఉచితంగా రైతులకు అందించి ఏర్పాటుచేశామని చెప్పారు. దీనికోసం ప్రభుత్వం రైతులపై పైసా భారం పడకుండా రూ.187 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఉమ్మడి జిల్లాలో మరో 1,100 వ్యవసాయ సర్వీస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వివాదంలో ఉన్నవాటిని పెండింగ్‌లో పెట్టి మిగిలినవాటికి సర్వీసులు మంజూరుచేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలకు 28 సబ్‌స్టేషన్‌లు మంజూరైనట్లు చెప్పారు. వీటి నిర్వహణ కోసం రూ.75 కోట్లు ఖర్చుచేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాలో లోఓల్టేజీ నివారణ, సరఫరా నష్టాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. తంబళ్లపల్లెలో 132 విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నామని, వి.కోట, పుంగనూరు, తిరుపతిలో 132 విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ప్రస్తుతం ఉమ్మడిజిల్లాలో 2.11కోట్ల యూనిట్ల విద్యుత్తు వినియోగం అవుతోందని, వేసవిలో పెరిగే విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో ఏఈ గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహంగా ఉంటూ మోసం చేశారు

న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు



విలేకర్లతో మాట్లాడుతున్న నారు లక్ష్మి, గుండాల జయమ్మ, నారు మధు

రైల్వేకోడూరు : స్నేహపూర్వకంగా ఉంటూ ఇద్దరు మహిళలు మోసం చేసి పన్నెండున్నర లక్ష విలువగల నగదు, బంగారు తీసుకెళ్లారని, తిరిగి ఇవ్వమని అడిగితే మీ కొడుకును చంపుతామని బెదిరిస్తున్నారని బాధితురాలు నారు లక్ష్మి, గుండాల జయమ్మ, నారు మధు పేర్కొన్నారు.గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ రైల్వేకోడూరు పట్టణంలోని ఉంగరాలనగర్‌లో ఉండగా మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ గుర్రప్పాశెంకు చెందిన కమ్మాలగిరి తులసమ్మ, కె.బుడుగుంటపల్లె పంచాయతీ కన్నెగుంట గ్రామానికి చెందిన వెంకట చెంచమ్మ(శశికళ) తమ ఇంటికి వస్తూ పోతూ ఉండేవారని, స్నేహంగా ఉంటూ మమ్మల్ని నమ్మించారన్నారు. కొంతకాలానికి తమ వద్ద 5లక్షలు విలువచేసే బంగారాన్ని తులశమ్మ, ఎడున్నర లక్ష విలువచేసే నగదు, బంగారాన్ని వెంకట చెంచమ్మ తీసుకుని వెళ్లిందన్నారు. డబ్బులు, బంగారాన్ని ఇవ్వమని అడిగితే తమ కొడుకును చంపుతామని బెదిరిస్తున్నారని నారు లక్ష్మి తెలిపింది. ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా తమకు న్యాయం జరగడంలేదని, ఎస్పీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. పోలీసులు విచారణ చేపట్టి తమకు రావాల్సిన డబ్బులు, బంగారాన్ని ఇప్పించాలని విన్నవించారు.తమకు ప్రాణరక్షణ కల్పించాలని కోరారు.

వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం



సిద్ధవటం బీటులోని సాబ్‌బావి అటవీ ప్రాంతంలో సాసర్‌ఫీట్‌లో తాగు నీటిని నింపుతున్న సిబ్బంది

సిద్ధవటం : సిద్ధవటం రేంజిలోని సాబ్‌బావి, సాబ్ మోర అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు గురువారం తాగునీటి సౌకర్యం కల్పిచామని రేంజర్ ప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం రేంజర్ మాట్లాడుతూ కడప డీఎఫ్‌ఓ ఆదేశాల మేరకు వేసవి కాలంలో అడవిలో ఉన్న వన్యప్రాణులు తాగునీటి కోసం గ్రామాల వద్దకు రాకుండా ట్యాంకర్‌లతో తాగునీటిని అటవీప్రాంతంలో ఉన్న సాసర్ పీట్లలో నింపుతున్నామన్నారు. ప్రతి వారానికి రెండు రోజులు నీరు నింపుతామన్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రజలు అడవికి నిప్పు పెట్టరాదన్నారు. అడవి జంతువులకు ముప్పు వాటిల్లకుండా వాటిని కాపాడేందుకు, అడవులను రక్షించేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. అడవులు ఉండటం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె. ఓబులేస్, ఎఫ్‌బీఓలు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, సాబ్‌బావి బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మహమ్మద్ రఫీ మృతదేహం

నిమ్మనపల్లె : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో గురువారం జరిగింది. ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన మహమ్మద్‌బేగ్ కుమారుడు మొఘల్ మహమ్మద్ రఫీ అలియాస్ బాబు గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి కాలినడకన మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యలో రెడ్డివారిపల్లె పంచాయతీ యల్రాతివారిపల్లె వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనికిరాని వస్తువంటూ ఉండదు

ఎస్‌డబ్ల్యూపీసీ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రాజంపేట టౌన్ : బుర్రకు పదును పెట్టి కాస్త ఆలోచిస్తే పనికిరాదని పడేసే వస్తువును సైతం వినియోగించుకోవచ్చని సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూ పీసీ) జిల్లా–కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కూచివారిపల్లె పంచాయితీ వర్మీకంపోస్టు కేంద్రంలో గురువారం మూడు డివిజన్‌లకు చెందిన క్లాప్‌మిత్రల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూచివారిపల్లె పంచాయతీ కార్యదర్శి నరసింహులు వర్మీకంపోస్టుకు చెత్తతో పాటు కలిసి వచ్చే ప్లాస్టిక్ వస్తువులను పడేయకుండా వాటిల్లో దాదాపు వంద డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను నాటి, తద్వారా వర్మీకంపోస్టు కేంద్రంలో ఓ నర్సరీనే సృష్టించడం అభినందనీయమని అన్నారు. జిల్లాలో ఏ వర్మీకంపోస్టులో కూడా ఇలాంటి ఆలోచనలతో నర్సరీని సృష్టించలేదని తెలిపారు. వర్మీకంపోస్టులను బాగా సద్వినియోగం చేసుకుంటే పంచాయితీల ఆదాయాన్ని ఘననీయంగా పెంచుకోవచ్చన్నారు. గ్రామాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి వాసన రాకుండా పేడతో అలకాలన్నారు. రెండు నెలల పాటు నానపెడితే చెత్త వాసనరాకుండా మగ్గిపోతుందన్నారు. అప్పుడు వర్మీ తొట్లలో ఒకలేయర్ చెత్త, ఒకలేయర్ పేడను వేయాలని తెలిపారు. వారం రోజుల పాటు ఉంచి తరువాత వానపాములను వదిలితే ఎరువు తయారవుతుందని తెలిపారు. ఎలాంటి కెమికల్స్ లేకుండా తయారయ్యే ఈ ఎరువును కొనుగోలు చేసేందుకు రైతులు ప్రాధాన్యత ఇస్తారన్నారు. ప్రభుత్వం వర్మీకంపోస్టు కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తోందన్నారు. ఈసందర్భంగా ఎరువు తయారీ విధానాన్ని ఆయన క్లాప్ మిత్రలకు ప్రయోగ రూపంలో వివరించారు. కాగా కూచివారిపల్లె పంచాయితీలో వర్మీకంపోస్టు అభివృద్ధికి విశేష కృషి చేసిన సెక్రెటరి నరసింహులు, ఈఓపీఆర్డీ హరిప్రసాద్‌రెడ్డి, క్లాప్ మిత్రలను వెంకటేశ్వర్లు తన సొంత ఖర్చులతో సత్కరించారు. కార్యక్రమంలో కూచివారిపల్లె సర్పంచ్ పూజారి మంగమ్మ, ఎంపీటీసీలు ఆరెళ్ళ రమణమ్మ, ఖాదర్‌బీ, రాజంపేట, రాయచోటి, మదనపల్లె డివిజన్‌లకు చెందిన డీఎల్‌పీఓలు నాగరాజు, నారాయణ, జయకుమారి, ఈఓపీఆర్డీ హరిప్రసాద్‌రెడ్డి, సెక్రెటరి ఈ.నరసింహులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

నమ్మి పని ఇస్తే బంగారం దోచేశాడు

బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

కలికిరి : నమ్మి పని ఇస్తే.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో చోరీకి పాల్పడి..దోచిన బంగారం పూడ్చి పెట్టిన ఘటన కలికిరిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం మండల పరిధిలోని మూరేవాండ్లపల్లి గ్రామం పెద్దవంకపల్లికి చెందిన రైతు ఈశ్వరయ్య, ముడియంవారిపల్లికి చెందిన వెంకట్రమణారెడ్డిని వ్యవసాయ, ఇంటి పనులు నిమిత్తం నియమించుకున్నాడు. ఇంటి గుట్టంతా తెలుసుకున్న వెంకట్రమణారెడ్డి పది రోజుల క్రితం ఈశ్వరయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడ్డాడు. ఆ రోజు నుంచి అతని ఆచూకీ లేకపోతే ఎక్కడికో వెళ్లిపోయాడనుకున్నారు. పదిరోజుల తరువాత అవసరమై ఇంట్లో నగలు చడగా కనిపించలేదు. దీంతో నిందితునిపై అనుమానం వచ్చి వాల్మీకిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు కలికిరి క్రాస్ రోడ్డులో బంధువుల ఇంట్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన నగల్లో 3గ్రాముల కమ్మలు కుదువ పెట్టి నగదు తీసుకున్నట్లు, మిగిలిన బంగారు నగలను క్రాస్ రోడ్డు సమీపంలో వాటర్ ట్యాంక్ వద్ద పూడ్చిపెట్టినట్లు పోలీసులకు తెలియజేశారు. సంఘటానికి స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో పూడ్చిన బంగారు నగలను తీసుకెళ్లారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

పీలేరురూరల్ : జీవితంపై విరక్తిచెంది వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ నరసింహుడు కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని బాలంవారిపల్లెకు చెందిన రాజన్న కుమార్తె వాణి (24)కు నాలుగేళ్ల క్రితం సంబేపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు వెంకటేష్‌తో వివాహమైంది, వీరికి రెండు సంవత్సరాల పాప, తొమ్మిది నెలల బాబు ఉన్నారు. బాబుకు పుట్టినప్పటి నుంచి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రాయచోటి, పీలేరులోని పలు ఆస్పత్రులలో చూపించారు. పదిహేను రోజుల క్రితం పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. కుమారుడి అనారోగ్యం గురించి తరచూ ఆందోళనకు గురవుతూ బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంటి పక్కన వసారాలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పొలం పనులకు వెళ్లి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు ఉరికి వేలాడుతున్న కుమార్తెను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎద్దుల పరుష ప్రారంభం



పరుషకు వచ్చిన ఎద్దులు

మదనపల్లె సిటీ : సీటీఎం నలవీరగంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం ఎద్దుల పరుష ప్రారంభమైంది. ఆలయం సమీపంలోని మైదానంలో సర్పంచ్ ఆనంద పార్థసారథి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.పరషకు మదనపల్లె, వాల్మీకిపురం, తంబళ్లపల్లె, పీలేరు, కురబలకోట ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో ఎద్దులను తీసుకువచ్చారు. కొంత మంది ఎద్దులను అమ్మకాలు చేశారు. ఎద్దుల పరషకు కావాల్సిన నీరు, ఇతర సౌకర్యాలను శేషాద్రి నాగేంద్ర ఏర్పాటు చేశారు. ఈ ఎద్దుల పరష 13 వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

దోపు తిరునాలతో ముగిసిన జాతర

జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం దోపు తిరునాల నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. దోపు తిరునాలకు భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర ఉత్సవాలు ఘనంగా జరిగినందుకు నిర్వాహకులు ఆనందపార్థసారథి, వెలుగు చంద్ర, వీరప్రతాప్, సురేంద్రరెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.


● పట్టుజారితే అంతే..





గుర్రంకొండ : నిండా పదేళ్లు కూడా లేని మైనర్లు.. ఆపైన ద్విచక్రవాహనం ఎక్కారు.అందులోనూ ఒకరిద్దరు కాదు ఏకంగా నలుగురు ఒకే స్కూటర్‌పై షికార్లు కొట్టారు. గుర్రంకొండలో ఇలాంటి దృశ్యాలు నిత్యం కనిపిస్తుంటాయి. ప్రమాదం ఏదైనా జరిగితే పరిస్థితి ఏంటని జనం చర్చించుకుంటున్నారు. అభం శుభం తెలియని చిన్నపిల్లలకు ద్విచక్రవాహనాలిచ్చి ఇలా రోడ్లపై పంపిస్తే సరిగ్గా నడపం చేతకాక ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు వదిలే సమయంలో మైనర్లు బైక్‌లను వేగంగా రోడ్లపై నడుపుతూ వెళుతుండడం గమనార్హం. గతంలో గుర్రంకొండ పట్టణంలో పదివరకు రోడ్డుప్రమాదాలు జరిగి పలువురు మైనర్లు ఆస్పత్రుల పాలయ్యారు. రోడ్డుప్రమాదాలపై మైనర్లు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అంటున్నారు.

గంగమ్మకు నల్లపూసల దండ వితరణ



నల్లపూసల దండ అందజేస్తున్న ఆంజనేయులు కుటుంబ సభ్యులు

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అనంతపురం గంగమ్మకు సుండుపల్లె మండలం, పెద్దబలిజపల్లె గ్రామానికి చెందిన ఆంజనేయులు, ధర్మపత్ని లక్ష్మీ ప్రసన్నలు 30.730 గ్రాముల బంగారాన్ని, రూ. 1,33,490లు విలువజేసే బంగారు నల్లపూసల దండను బహూకరించారు. గురువారం ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, చైర్మన్ నరసింహారెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యాత్యకు యత్నించారు. పట్టణంలోని చౌడేశ్వరినగర్‌కు చెందిన హేమలత(21) గురువారం పురుగుల మందు తాగింది. బాధితురాలికి పదినెలల క్రితం సత్యసాయిజిల్లా తనకల్లుకు చెందిన నవీన్‌తో వివాహమైంది. పెళ్లిసమయంలో 250గ్రాముల బంగారు నగలు, రూ.4లక్షలు కట్నంగా ఇచ్చినా కొంతకాలం తర్వాత అత్తింటివారి నుంచి వేధింపులు అధికమవడంతో హేమలత ఆత్మహత్యకు ప్రయత్నించింది. బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు గ్రామానికి చెందిన సోమశేఖర్ భార్య అరుణకుమారి(26) కుటుంబసమస్యలతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. పట్టణంలోని అమ్మినేనివీధికి చెందిన బి.రాజేంద్రప్రసాద్ (47) రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. గురువారం వ్యక్తిగత కారణాలతో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ కేబుళ్ల చోరీ

రామాపురం: మండలంలోని హసనాపురం పంచాయతీ చీకటివాండ్లపల్లెకు చెందిన చీకటి ఆంజనేయులు , చీకటి గంగన్న , గంగమ్మ, వెంకటరమణ, బ్రహ్మయ్య, వెంకటేశులకు చెందిన వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన మోటారు కేబుళ్లను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఈమేరకు గురువారం మండల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. ఆంజనేయులు మూడు వ్యవసాయ బోర్ల వద్ద మోటార్లు ఏర్పాటు చేశారు. అందులోని 800 మీటర్ల కేబుల్ వైర్లను కట్ చేశారని, వీటి ఖరీదు సుమారు రూ.40వేలు ఉంటుందన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



హోంగార్డ్స్ పరేడ్‌ను పరిశీలిస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్

కడప అర్బన్ : కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానాన్ని గురువారం హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్ పరేడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన దర్బార్ పరేడ్ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ హోంగార్డులు పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారన్నారన్నారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యే దృష్టి సారించాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. హోంగార్డ్స్ కొన్ని సమస్యలను కమాండెంట్‌కు విన్నవించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, ఆర్‌ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, ఆర్‌ఎస్‌ఐలు, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

హాకీ పోటీల్లో క్రీడాపాఠశాల విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారిణులను అభినందిస్తున్న ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్

కడప స్పోర్ట్స్ : ఇటీవల కాకినాడలో నిర్వహించిన శాప్ లీగ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో వైఎస్‌ఆర్ కడప జిల్లా బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచింది. జిల్లా జట్టుకు క్రీడాపాఠశాల నుంచి కె. చరణ్, జి. చందు, ఎం. శ్రీను, పి. బాలాజీ, ఎస్. మహమ్మద్, భగవాన్‌లు పాల్గొని జిల్లా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. అదే విధంగా బాలికల విభాగంలో ఆరుగురు క్రీడాకారిణులు వారి సొంత జిల్లాలకు ప్రాతినిధ్యం వహించి రాణించారు. ఈ సందర్భంగా వీరిని క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ అభినందించారు. కార్యక్రమంలో శిక్షకులు అనిల్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.